# కుక్రకుంక

కాళ్ళు కడుక్కుని వస్తున్న పాపారావుకి హఠాత్తుగా ఏదో గుర్తు కొచ్చింది.

గబగబా వెళ్ళి యూనిఫారమ్ పాంటు జేబులు వెదికాడు. నాల్గు మడతలు పెట్టున్న యాభై రూపాయల నోటు జేబులో ఓమూల చిక్కడి పోయింది. దాన్ని బయటికి తీశాడు.

మడతలు విప్పగానే ఆ కుర్రాడి మొహం కనిపించింది. పాపారావుకి జాలేసింది.

కుర్రవెధవ! కాకీబట్టలు చూసి బెదిరిపోయాడు. నిజంగానే సాని కొంపలోంచి లాక్కొచ్చానని బొక్కలో తోస్తాననుకున్నాడు. సానికొంప లోకి వెళ్ళే ధైర్యమే వుంటే నాకు టోకరాయే కొట్టేవాడు. వెర్రివెధవ...!

ఆ నోటు పట్టుకుని బీరువా దగ్గరకి వెళ్ళాడు. లాకర్ తెరిచి దాంట్లో పడవేయబోయినవాడల్లా ఆగి మామూలు అలవాటు ప్రకారం పెన్‌తో దానిమీద 'పి' అని రాసి మరీ పడేశాడు.

''ఇంకెంత సేపండీ... రండి భోజనానికి...'' భార్య పిలుపు వినిపించగానే బీరువా తాళంవేసి, చెవులని దేవుడి బొమ్మ దగ్గర పడేసి వంటింట్లోకి దారితీశాడు పాపారావు.

* * *

రాత్రి పన్నెండయింది.

రోడ్డు మీద ఎక్కడా జనసంచారం లేదు. చిరాకనిపించింది పాపారావుకి.

మనుషులే కనిపించకపోతే తను నోట్లు చూసేదెలా? కనీసం ఒక్క యాభై రూపాయల నోటునైనా చూడకుండా డ్యూటీ దిగకూడదని తను నిన్ననే నిర్ణయించుకున్నాడే... మరిప్పుడెలా? ద్వితీయ విఘ్నం అసలు మంచిది కాదు... ఎలాగైనా ఈరోజు సంపాదన యాభై తగ్గడానికి వీల్లేదు. స్థిరనిశ్చయానికొచ్చాడు పాపారావు.

పోలీసు తలచుకోవాలేగాని పైసలకి కొదవా! పకపకా నవ్వాలనిపించింది పాపారావుకి. ప్రస్తుతానికి ఆ కోరిక వాయిదా వేసుకొని పైసల వేటలో ముందుకు కదిలాడు...

మరో అరగంట గడిచింది.

బీట్ ఏరియానంతట్నీ ఓసారి చూడడం అయిపోయింది. అయినా బేరం కాలేదు. పాపారావులో అసహనం క్షణక్షణానికి పెరగసాగింది... అయినా బుర్ర పనిచేయటం మందగించలేదు. ఇంకా చురుగ్గా ఆలోచించసాగింది.

హఠాత్తుగా అతని బుర్రలో మెరుపు మెరిసింది.

కులాసాగా లాఠీ వూపుకుంటూ నూతనోత్సాహంతో ముందుకి కదిలాడు.

ఆ సందులోకి అడుగుపెట్టగానే అతని వుత్సాహం ద్విగుణీకృతమైంది.

రోడ్డు మధ్యలో నిలబడి ఆ వీధిలోవున్న వాకిట్లన్నింటివేపు ఓసారి దృష్టి సారించాడు. అన్ని ఇళ్ళ తలుపులూ వేసేవున్నాయి. అంటే అందరూ బిజీగా వున్నారన్నమాట!



ఏ ఇంటి తలుపు కొట్టాలి?

మళ్ళీ ఓసారి అన్ని గుమ్మాలకేసి చూశాడు.

ఓ ఇంటిని ఎన్నుకుని గబగబా అటు కదిలాడు.

తలుపుమీద లాఠీతో కొట్టాడు - తియ్యమన్నట్లు!

హఠాత్తుగా లోపలి గుసగుసలు ఆగిపోయాయి. సూది కిందపడితే వినిపించే నిశ్శబ్దం!

"నాకు అన్నీ తెలుసులే...ముందు తలుపుతియ్యి..." లాఠీని మళ్ళీ తలుపు మీద టకటకలాడిస్తూ గట్టిగా అరిచాడు.

వెనక తలుపులు తీస్తున్న శబ్దం.

"తియ్యమంటుంటే వినిపించడంలా? వాడెళ్ళిపోయినా నిన్ను వదలను"

తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా బిక్కు బిక్కుమంటూ సావిత్రి నిలుచుంది.

"తప్పుకో..." ఆమెను తోసుకుంటూ లోపలికి దూసుకుపోయాడు పాపారావు.

అతను లోపల తలుపు దగ్గిరకి వెళ్ళగానే ఎవరో చటుక్కున గోడ దూకి పరుగెత్తుకెళ్ళిపోయాడు. చీకటిలో ఎవరో కుర్రాడిలా కనిపించింది. గోడదూకి వాడిని వెంటాడే ఓపికలేక వెనక్కి తిరిగాడు.

సావిత్రి దిగులుగా అక్కడే నిలుచునుంది. పాపారావుకి పాపం అనిపించలేదు. పాప పుణ్యాల గురించి ఆలోచిస్తే పైసలు సంపాదించలేం. ఇది పాపారావు పద్ధతి.

"వాడిచ్చిన పైసలు ఇలా పారేయ్, నే పోతా." నిర్లక్ష్యంగా చెయ్యి చాపాడు.

"ఏదీ... అతను ఇవ్వకుండానే నువ్వొచ్చేశావ్...అతను పారిపోయాడు" నసిగింది.

"ఈ కబుర్లు నాకు చెప్పకు... మర్యాదగా ఇస్తావా? నన్నే తీసు కొమ్మంటావా?" ఆమె గుండెలవేపే చూస్తూ ఒకడుగు ముందుకేశాడు.

వులిక్కిపడి జాకెట్టువేపు చూసుకుంది సావిత్రి. జాకెట్టులోంచి బయటికి తొంగిచూస్తూ యవ్వనపు పొంగులు... వాటి మధ్య యాభై రూపాయల కాగితం...!

ఆమె గుండె ఝల్లుమంది. ఇది వీడి కంటపడిందన్నమాట! అయితే దీనికి కాళ్ళు వొచ్చినట్టే!!

"ఎంతసేపు నుంచోవాలి?" చొరవగా జాకెట్టులో చెయ్యిపెట్టి దాన్నందుకో బోయాడు పాపారావు.

భయంతో వెనక్కి జరిగింది సావిత్రి. వీడితో గొడవపడితే లాక ప్పులో వేయిస్తాడు... రెండు మూడు రోజులు అన్నం నీళ్ళు వుండవు... పైగా పోలీసోళ్ళందరూ అవురావురుమంటూ చేరతారు.. తక్కున ఆ కాగి తాన్ని బయటికి తీసింది. గబుక్కున ఆమె చేతుల్లోనుండి దాని లాక్కు న్నాడు పాపారావు.

'నా దగ్గర వెధవ్వేషాలు వెయ్యకు...' లాఠీ వూపుకుంటూ బయ టికి దారితీశాడు.

సావిత్రి స్థాణువులా అక్కడే నిలబడిపోయింది.

*　　*　　*

యూనిఫారమ్ విప్పి కాళ్ళు కడుకుని వెళ్తున్న పాపారావుకి హఠా త్తుగా ఏదో గుర్తుకొచ్చింది.

గబగబా వెళ్ళి యూనిఫారమ్ పాంటు జేబులు వెదికాడు. ఆనందంగా యాభై రూపాయల నోటుని బయటికితీసాడు.

లాకర్ తెరిచి దాంట్లో దాన్ని పడేయబోతూ ఆగాడు. పెన్నందు కుని దానిమీద రాద్దామని నోటుని విప్పేడు- 'పి' అన్న పెద్ద అక్షరం అతన్ని వెక్కిరించింది.

గబగబా కాష్‌బాక్స్ తడిమాడు. ఖాళీగా వుంది! అనుమానం వచ్చి వెనక్కి తిరిగాడు.

ఎవరో గుమ్మం అవతల చటుక్కున పక్కకి కదిలారు.

గబగబా ముందుకొచ్చిన పాపారావు ఒక్క గెంతులో గేటుదాటి రోడ్డుమీదకి వెళ్ళిన కొడుకుని చూశాడు.

హఠాత్తుగా చీకట్లో సావిత్రి ఇంట్లో గోడదూకిన ఆకారం పాపారావు కంటిముందు మెదిలింది.

పాపారావు స్థాణువులా నిలుచుండిపోయాడు! ●

(విపుల మే 1988)